

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## ఎలా ఉన్నావు?

**శ్రీకాంత్ వచ్చేదాకా సుచిత్ర** అసహనంగా ఇంట్లోకి, బయటకి తిరుగుతూ వేచి చూసింది. 'ఎప్పుడొస్తున్నావ్?' అని ఫోన్ చేద్దామనుకుంది కాని, పనయ్యాక శ్రీకాంత్ ఒక్క నిమిషంకూడా వృధా చేయకుండా సరాసరి ఇంటికి వచ్చేస్తాడని ఆమెకి తెలుసు. మొత్తానికి శ్రీకాంత్ గేట్ తీసుకుని లోపలకి వచ్చే సమయానికి ఆమె సహనం అంతా అయిపోయింది.

"ఇప్పుడా రావడం? నీకోసం ఎంతసేపటినించి చూస్తున్నానోతెలుసా?" అతనికి ఎదురెళ్ళి నిందాపూర్వకంగా చెప్పింది.

శ్రీకాంత్ చేతి గడియారం చూసుకుని ఆశ్చర్యంగా చెప్పాడు.

"ఎప్పుడూ వచ్చే టైమేగా? లేటేం లేదు."

సుచిత్ర నవ్వేసింది.

"అవున్లే. నా ఆరాటానికి పుస్తకాల్లో చెప్పినట్లు క్షణాలు యుగాల్లా తోచాయనుకో."

"విషయం ఏంటి సుచీ?" రిలాక్స్ అయ్యాక శ్రీకాంత్ ప్రశ్నించాడు.

"నేనో రీసెర్చ్ చేయాలనుకుంటున్నాను కాంత్."

"రీసెర్చా? దేనిమీద?" శ్రీకాంత్ విస్మయంగా అడిగాడు.

సుచిత్ర ఉత్సాహంగా అతని పక్కన కూర్చుని చెప్పింది.

"అదో పెద్ద కథ ఊహూ మధ్యస్థం కథ. నువ్వు ఒప్పుకోవాలి కాంతూ."

"విషయం చెప్పు ముందు. ఐనా నా పర్మిషన్ అడగటం ఎప్పటినించి?"

"ఇవాళ మధ్యాహ్నం మా కావేరి కాల్ చేసింది .'ఎలా ఉన్నావే?' అంటే 'చాలా బాగున్నాను' అంది. కొద్దిసేపు మాట్లాడాక తను లైన్ కట్ చేసింది. నేను నా పనిలో మునిగిపోయా. హఠాత్తుగా స్ఫురించింది" సుచిత్ర సస్పెన్స్ కోసం ఓ క్షణం ఆగింది.

"ఏమని? నిన్ను 'ఎలా ఉన్నావే?' అని అడగలేదనా?"

"నీకు జోకు వేయడం రాదు కాని చెప్పేది విను. ఈ మధ్యకాలంలో 'చాలా బాగున్నాను' అనే మాట విని చాలా కాలమైంది. కావేరి అలా అన్నప్పుడు నాకెంత హాయిగా, వినసొంపుగా అనిపించిందో. పాజిటివ్ వైబ్ అంటారే అలా అన్నమాట. దాంతో మా మిగిలిన ఫ్రెండ్స్‌కి ఫోన్ చేసాను.."

సుచిత్రకి నలుగురు బెస్ట్ ఫ్రెండ్స్ ఉన్నారని, వాళ్ళలో ఇద్దరు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలని శ్రీకాంత్‌కి తెలుసు. పెళ్ళికి ముందే వాళ్ళ గురించి చెప్పింది.

"మా ముగ్గురమ్మాయిలకి ఈ అబ్బాయిల్లో ఎవరిమీదా ప్రేమా, దోమలు లేవు. అలా అని బ్రదర్స్ లాంటి వాళ్ళని చచ్చినా చెప్పను ఫ్రెండ్స్. బెస్ట్ ఫ్రెండ్ అంతే. భవిష్యత్తులో నువ్వు అనుమానపడతావని ముందే చెప్తున్నా."

శ్రీకాంత్ నవ్వాడు.

"అంటే ఐదుగురు అమ్మాయిల గ్రూప్ అన్నమాట."

"నువ్వు స్పాంటేనియస్‌గా మాట్లాడదాం అనుకుంటావుకాని పాపం నీకు జోక్ చేయడంరాదు" సుచిత్ర జాలిగా చెప్పింది.

"నాకు జస్ట్ ఫ్రెండ్స్ ఉన్నారు కాని బెస్ట్ ఫ్రెండ్స్ లేరు సుచీ. నువ్వు లక్కీ" మనస్ఫూర్తిగా చెప్పాడు.

"కదా?" సుచిత్ర కళ్ళు మెరిసాయి.

సుచిత్ర మొదట సాగర్‌కి ఫోన్ చేసింది.

"హలో సాగర్ ఎలా ఉన్నావు?" అడిగింది.

"ఫర్లేదు సుచీ ఏదో నడిచిపోతోంది" నిర్లిప్తంగా చెప్పాడు.

"ఏమైంది సాగర్? మనందరిలో తెలివైనవాడివి. మంచి జాబ్ తెచ్చుకున్నావు. ఆ మాటలేంటి?" సుచిత్ర కోప్పడింది.

"పనిలో ఉన్నా సుచీ. మళ్ళీ మాట్లాడ్తా" సాగర్ లైన్ కట్ చేసాడు.

సుచిత్రకి ఓ క్షణం బాధేసింది. తర్వాత రచనకి ఫోన్ చేసింది.

"హలో రచనా ఎలా ఉన్నావే?" ఆప్యాయంగా అడిగింది.

"ఏదో ఇలా ఉన్నానే. నువ్వెలా ఉన్నావు?" రచన అడిగింది.

"బానే ఉన్నాను. అందమైన రచనకి అంత విసుగెందుకో?"

"అసలే చిరాగ్గా ఉన్నా. ఇంకా రెచ్చగొట్టకు" రచన అరిచి ఫోన్ పెట్టేసింది.

సుచిత్ర చివరిగా జయంత్‌కి ఫోన్ చేసింది.

"జై ఎలాఉన్నావు?" అడిగింది.

"బ్రహ్మాండంగా ఉన్నాను సుచీ. నువ్వెలా ఉన్నావు? చాలా రోజులైంది మనం మాట్లాడుకుని" జయంత్ ఉత్సాహంగా అన్నాడు.

"కదా! మళ్ళీ మనమంతా కలవాలి ఓసారి" సుచిత్ర చెప్పింది.

పది నిమిషాలు మాట్లాడుకున్నాక ఫోన్ పెట్టేసింది.

"నువ్వు అప్పుడప్పుడూ ఫ్రెండ్స్‌తో మాట్లాడుతూనే ఉంటావుగా? కొత్తగా ఏముంది? శ్రీకాంత్ అయోమయంగా అడిగాడు.

"నీ కర్థంకాదని నాకు తెలుసులే. విను "ఎలా ఉన్నావు?" అనే ప్రశ్నకి ఒకమ్మాయి, ఒకబ్బాయి, 'చాలా బాగున్నా, బ్రహ్మాండంగా ఉన్నా' అని చెప్పారు.

రెండో అబ్బాయి 'ఫర్లేదు' అంటే రెండో అమ్మాయి 'ఏదో ఇలా ఉన్న ' అని చెప్పింది. అందరి సామాజిక ఆర్థిక స్థితిగతులు ఆల్మోస్ట్ ఒకటే. మరి ఈ ఆన్సర్స్ ఇలా ఉన్నాయేంటి?" సుచిత్ర అడిగింది.

"ఆ నిమిషంలో వాళ్ళకున్న ఇబ్బందులవల్ల అలా చెప్పుండచ్చు" శ్రీకాంత్ చెప్పాడు.

"రచన చాలా చిరాగ్గా ఉంది కాబట్టి దాని అప్పటి స్థితి అనుకోవచ్చు. మరి సాగర్? ఆ గొంతులో ఎంత నిర్లిప్తతో తెలుసా?"

"అయితే ఏమంటావు? అందరికీ నువ్వెలా ఉన్నావని చెప్పావు?"

"అందరికీ 'బానేవున్నా' అని చెప్పా తర్వాత ఆలోచించా. నిజానికి నేను 'బానే' కాదు 'బావున్నా'. మరి నేనెందుకలా చెప్పానో మధ్యాహ్నమంతా ఇదే ఆలోచిస్తూన్నా."

"ఏం ఇవాళ మన వైఫై పనిచేయలేదా?" శ్రీకాంత్ నవ్వాడు.

"చంపుతా. సీరియస్‌గా మాట్లాడూతూంటే ఏంటిది?" అరిచింది.

"ఈ మూడ్‌లో నువ్వున్నప్పుడు ఎవరైనా ఫోన్ చేస్తే ఏమంటావు? 'ఏదో ఇలా ఈ మనిషితో వేగలేకపోతున్నా' అనవూ?" శ్రీకాంత్ విశ్లేషించాడు.

"ఏనీవే. నేనొక నిర్ణయానికి వచ్చాను. నేనో పదిరోజులు వెకేషన్‌కి, అంటే వీళ్ళందరి ఇళ్ళకి వెళ్దామనుకుంటున్నాను.

"పదిరోజులే?" శ్రీకాంత్ నివ్వెరపోయాడు.

"నలుగురి ఇళ్ళల్లో రెండేసి రోజులు చొప్పున ఉంటా. మధ్యలో ప్రయాణాలకి రెండురోజులు. లేదా ఇంకా ఎక్కువే పట్టచ్చు. సూట్‌కేస్ సర్దేసుకున్నా. రేపే నా విజయవాడ ప్రయాణం"

"పదిరోజులు నువ్వు లేకుండా ఉండాలా?" శ్రీకాంత్ నీరసపడ్డాడు.

"తప్పదు. అప్పుడు ఎవరైనా ఫోన్ చేసి ఎలా ఉన్నావు?' అని అడిగితే 'ఏం బాలేను ' అని చెప్పు" సుచిత్ర నవ్వింది.

విజయవాడ బస్టాండ్‌లో ఉన్నా. మీ ఇంటి లొకేషన్ పంపు" సుచిత్ర ఫోన్‌లో చెప్పింది.

"వావ్.. సుచీ.ముందు చెప్పచ్చుగా? బస్టాండ్‌కి వచ్చేదాన్ని. ఇప్పుడే పంపుతున్నా" కావేరి పట్టరాని ఆనందంతో చెప్పింది.

"ఈరోజు లీవ్ పెట్టచ్చా నువ్వు?" సందిగ్ధంగా అడిగింది.

"ఎందుకు పెట్టకూడదు? పెట్టేసా అనుకో. వచ్చెయ్ వచ్చెయ్." కావేరి ఫోన్ పెట్టేసింది.

ఇరవై నిమిషాల్లో కావేరి ఇంటి ముందు ఆటో దిగింది. చిన్న ఇండిపెండెంట్ ఇల్లు. ఇంటి ముందు పూల మొక్కలు. వాటి పాదులు తడిగా, అప్పుడే నీళ్ళు పెట్టినట్లుగా ఉన్నాయి. ఇంటిగేట్‌కి మాలతి తీగ ఆర్చ్‌లా అల్లుకుని ఉంది.

ఆటో ఆగిన చప్పుడు వినగానే కావేరి బయటకి పరిగెత్తుకు వచ్చింది.

"సుచీ. ఎన్ని రోజులైందే నిన్ను చూసి" అప్రయత్నంగా ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ఆమె సుచిత్ర సూట్‌కేస్ అందుకుని లోపలకి నడిచింది. సుచిత్ర వరండాలో చెప్పులు విప్పి ఆమె వెనకే వెళ్ళింది. పెద్ద హాల్. ఓ గోడకి అరవై ఇంచెస్ టి.వి. అందులో పెద్ద గొంతుతో ఒకాయన ప్రవచనాలు చెప్తున్నాడు. డెబ్బై ఏళ్ళు దాటిన ఒకావిడ సోఫాలో కూర్చుని శ్రద్ధగా వింటోంది. పక్కనే కూర్చున్న పెద్దాయన ఈనాడు పేపర్ చదువుతున్నాడు.

"అత్తయ్యగారూ మా ఫ్రెండ్ అండీ. సుచిత్ర. హైదరాబాద్‌నించి వచ్చింది" ఆవిడ దగ్గర ఆగిన కావేరి వినమ్రంగా చెపింది.

ఓ క్షణం టి.విని మ్యూట్‌లో పెట్టిన ఆవిడ సుచిత్రని ఎగాదిగా చూస్తూ అడిగింది.

"రాత్రి చెప్పలేదే ఈ అమ్మాయి వస్తుందని? ఏదైనా పనుందా. బెజవాడలో?"

తడబడ్డ సుచిత్ర చెప్పింది.

"ఏనేం లేదండీ. కావేరిని చూద్దామనే వచ్చాను. ముందుగా చెప్పకుండా సర్‌ప్రైజ్ ఇద్దామని."

"మేము ఇంట్లో లేకపోతే అప్పుడింకా సర్‌ప్రైజ్" ముసలాయన పేపర్లోంచి తలెత్తకుండా అన్నాడు.

ఆవిడ టి.విని అన్‌మ్యూట్ చేసి మళ్ళీ వినసాగింది.

కావేరి సూట్‌కేస్‌తో ఓ గదిలోకి వెళ్ళింది. ఆమె వెనకే వెళ్ళిన సుచిత్రకి అది గెస్ట్ రూమని అర్థమైంది.

"బ్రషింగ్ చేసుకో. కాఫీ ఇస్తా" కావేరి తలుపు దగ్గరకి వేసి వెళ్ళింది.

అప్పటిదాకా ఊపిరాడనట్లుగా ఉన్న సుచిత్ర దీర్ఘశ్వాస తీసుకుని 'ఏం నెగటివ్ మనుషుల్రా బాబోయ్' అనుకుంటూ సూట్‌కేస్‌లోంచి కిట్, టవల్ తీసుకుని అటాచ్డ్ బాత్రూములోకి నడిచింది.

ఏకంగా స్నానం కూడా చేసేసి తయారై బయటకి వచ్చిన సుచిత్రకి వంటగదిలో కావేరితో మాట్లాడుతున్న మధుర్ కనిపించాడు.

"మధు. సుచీ" కావేరి స్నేహితురాల్ని భర్తకి  పరిచయం చేసింది.

"హలో మధుర్‌గారూ. ఎలా ఉన్నారు?" సుచిత్ర అడిగింది.

"ఆనందంగా" చేత్తో హాల్ వంక చూపిస్తూ మళ్ళీ చెప్పాడు.

"అక్కడ వాళ్ళిద్దరూ. పక్కన కావేరి ఉంటే ఇంక స్వర్గం వేరే ఎక్కడో లేదండీ."

అతను కావేరి భుజం చుట్టూ ప్రేమగా చెయ్యివేసి దగ్గరకి అదుముకున్నాడు.

సుచిత్ర ఆ సమాధానాన్ని గుర్తుపెట్టుకుంది.

"నేను బేంక్‌కి వెళ్తానండీ. కావేరి సెలవు పెట్టింది కాబట్టి మీ ఫ్రెండ్స్ ఇద్దరూ హాయిగా కబుర్లు చెప్పుకోండి" మధుర్ బయటకి నడిచాడు.

అతను తల్లితండ్రుల దగ్గర ఆగి వాళ్ళకి చెప్పి వెళ్ళడం గమనించిన సుచిత్ర 'మంచబ్బాయ్' అనుకుంది.

కావేరి రెండు స్టీల్ గ్లాస్‌లతో కాఫీ తెచ్చి 'రా సుచీ' అంటూ ఆమెని పెరట్లో తీసుకెళ్ళింది. అక్కడున్న చిన్న రాతి బెంచ్ మీద కూర్చుంటూ అడిగింది.

"ఇప్పుడు చెప్పు. ఏంటీ హటాత్ రాక? కొంపతీసి కాంత్‌తో గొడవ పడలేదు కదా?"

సుచిత్ర పెద్దగా నవ్వింది.

"నువ్వు సినిమాలు ఎక్కువగా చూస్తావేంటి? పెట్టె పట్టుకుని రాగానే భర్తతో తగాదాలేనా? మొన్న నీతో మాట్లాడాక నిన్ను చూడాలనిపించింది. వచ్చేసా."

"మంచి పని చేసావు. కాంత్ ఎలా ఉన్నాడు?"

"బుద్ధిగా పనిచేసుకుంటూ, నా మాట వింటూ బాగున్నాడు."

"ఇవాళ సెలవు పెట్టా కాబట్టి వంట చేయలేదింకా. రా. కిచెన్‌లోకి వెళ్దాం" కాఫీ ముగించిన కావేరి లేచింది.

"ఆవిడేం చేయదా?" సుచిత్ర అనుమానంగా అడిగింది.

"ఇన్నేళ్ళూ చేసిందిగా. పాపం రెస్ట్ తీసుకోనీ" కావేరి తన సహజమైన చిరునవ్వుతో చెప్పింది.

ఇద్దరూ లోపలకి వచ్చారు. హాల్లో టి.విలో ఇప్పుడు టి.టి.డి ఛానల్లో ఏదో సేవ చూపిస్తున్నారు. ఆయన ఇంగ్లీష్ పేపర్ చదువుతున్నాడు.

కావేరి ఇడ్లీ ప్లేటు, మంచినీళ్ళు టేబుల్ మీద పెట్టి వాళ్ళని పిలిచింది.

"నీక్కూడా పిల్లా పీచు లేరా?" ఆవిడ వంటగదిలోని సుచిత్రని ఎగాదిగా చూస్తూ అడిగింది.

సుచిత్రకి ఏం చెప్పాలో తెలీలేదు. ఏం అనుకోవద్దు అన్నట్లుగా కావేరి అభ్యర్ధనగా చూసింది.

కావేరి చకచక వంట చేస్తూంటే సుచిత్ర పక్కనే నిలబడి కబుర్లు చెప్పింది.

"మధుకి పొద్దున బాక్స్ ఇవ్వలేదు. బేంక్ పక్క వీధిలోనే. ఇచ్చొద్దాం పద" కావేరి వంటయ్యాక చెప్పింది.

ఇద్దరూ లంచ్ బాక్స్, వాటర్ బాటిల్‌తో బయటికి వచ్చారు.

"బాబోయ్. ఏం మనుసులు? వీళ్ళతో ఎలా వేగుతున్నావే? 'ఎలా ఉన్నావు?' అంటే 'చాలా బాగున్నాను' అంటావా? ఇదా చాలా బాగుండటం?" సుచిత్ర కోపంగా అరిచింది.

కావేరి నవ్వింది.

"నవ్వకు. నాకు కోపం వస్తుంది. మధుది బేంక్ జాబ్ అని సాఫ్ట్‌వేర్ జాబ్ వదిలేసి స్కూల్లో టీచర్‌గా చేరావు. ఇంట్లో ఆ రాక్షసులు. నువ్వేమో చాలా బాగున్నావు.

"మధు మంచివాడు సుచీ. నాకు చాలా సపోర్ట్. తను ఒక్కడే కొడుకు వాళ్ళకి. కొంచెం అభద్రత. అదీకాక నాకు ఇంకా పిల్లలు పుట్టలేదని బాధ. అంతే తప్ప వాళ్ళు రాక్షసులేం కాదు. మాకు కనీసం ఇద్దరు పిల్లలు కావాలి. ఒక్కళ్ళే అయితే నేనూ అలా తయారవుతానేమో. పిల్లలు పుడితే వాళ్ళకి నా మీదున్న అసంతృప్తి తగ్గిపోతుంది. బేంక్ జాబైనా ఆఫీసర్ కాబట్టి మధుకి మంచి జీతమే వస్తుంది. అది చాలు మాకు. చదువుకున్నా కాబట్టి జాబ్ చేస్తున్నా. స్కూల్ అయితే హాలిడేస్, టైమింగ్స్ బాగుంటాయని చేరా. అంతే. నేనేం త్యాగాలు చేయలేదు. నేను మధు మాకు పుట్టబోయే పిల్లలకోసం ఎదురు చూస్తున్నాం కావేరి నిదానంగా చెప్పింది.

ఫోన్ చేయగానే మధుర్ బయటకి వచ్చాడు. లంచ్ బేగ్ అందుకుని ప్రేమగా అడిగాడు.

"నువ్వు తిన్నావా? నేను వచ్చేవాడ్నిగా. సాయంత్రం త్వరగా వచ్చేస్తాను. ఎటైనా వెళ్దాం."

అతను కొనగోటితో భార్య నుదుటిమీద పడే వెంట్రుకలని వెనక్కి నెట్టాడు.

ఆ చర్య సుచిత్ర మనసుకి హత్తుకుపోయింది.

"ఇక్కడినించి ఢిల్లీకి ఫ్లయిట్స్ ఉన్నాయి కదా? టిక్కెట్స్ చూస్తాను. వీలైతే రాత్రికి లేదా రేపు ఉదయం ఢిల్లీ వెళ్తా. సాగర్ ఇంటికి."

మధ్యాహ్నం భోజనాలయాక చెప్పింది.

"అప్పుడే వెళ్తావా? రెండు రోజులు ఉండచ్చుగా సుచీ?" కావేరి అభ్యర్ధనగా అడిగింది.

"నిజానికి నిన్ను కూడా తీసుకెళ్దామనుకున్నా. కాని నువ్వు రాలేవని అర్ధమైంది." సుచిత్ర నిరాశగా చెప్పింది.

"పోనీ. రేపు వెళ్ళు. ఇవాళ ఉండిపో" కావేరి కోరింది.

"సరే" సుచిత్ర ఒప్పుకుంది.

ఏర్‌పోర్ట్‌లో సాగర్‌ని చూడగానే సుచిత్ర ఆనందంగా చిన్న కేక పెట్టింది.

"సాగర్! ది గ్రేట్ వైస్ ప్రెసిడెంట్."

సాగర్ మృదువుగా నవ్వి చెప్పాడు.

"నీకు వి.పి.నికాదు సుచీ. సాగర్‌నే."

"నువ్వు ఇంత గొప్పవాడివయ్యావంటే ఎంత హేపీగా ఉందో సాగర్" అతని చేతిని పట్టుకుని ఉద్వేగంగా చెప్పింది.

సాగర్ చిక్కాడని, ఉత్సాహంగా లేడని సుచిత్ర గ్రహించింది.

'పని వత్తిడేమో' అనుకుంది.

"ఇక్కడికి మీ ఇల్లెంత దూరం? నీ ఆఫీస్ టైమిగ్స్ ఏమిటి?" కారులో కూర్చుంటూ అడిగింది.

"గుర్‌గావ్. దగ్గరే. ఆఫీస్‌దేముంది? ఇంట్లోంచి కూడా మీటింగ్స్‌కి అటెండ్ అవచ్చు. ఐనా రేపు సాటర్‌డే కదా, నాకు సెలవే. అనుకోని ప్రయాణమా? అనుకుని వచ్చావా? హైదరాబాద్‌నించి కాక విజయవాడ నించి వచ్చావేంటీ?"

సాగర్ డ్రైవ్ చేస్తూ అడిగాడు.

"అనుకోని, అనుకున్న ప్రయాణమే, కావేరితో వద్దామనుకున్నాను. కాని ఇంట్లో తను లేకపోతే ఒక్క నిమిషం గడవదు. అందుకని నేనొక్కదాన్నే వచ్చేసా. నువ్వు చిక్కావు సాగర్. వర్క్ టెన్షన్స్ ఎక్కువగా ఉన్నాయా?" అభిమానంగా అడిగింది.

"వర్క్‌లో ప్రాబ్లం లేదు సుచీ. ఇంట్లోనే."

సుచిత్ర మాట్లాడలేదు. సున్నితమైన విషయం కాబట్టి ఎలా మాట్లాడాలో అర్ధంకాలేదు.

కారు ఓ అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో ఆగింది. సాగర్ సూట్‌కేస్‌తో ముందు నడుస్తూంటే సుచిత్ర అనుసరించింది.

పదో అంతస్థులోని విశాలమైన ఫ్లాట్ అది. హాల్లో గోడ బదులు అద్దాలు ఉండటంతో బయటి వాతావరణం కనిపిస్తోంది.

"వావ్! నేనైతే ఈ హాల్లో, ఆ కౌచ్‌లో కూర్చుని బయటి ప్రపంచం చూస్తూ ఉండిపోతా" సుచిత్ర సంబరంగా చెప్పింది.

అలికిడికి బయటకి వచ్చిన యువతి సాగర్‌ని చురుగ్గా చూస్తూ అడిగింది.

"ఆఫీస్‌కి వెళ్ళలేదా?"

"లేదు. సుచీ వచ్చింది హైదరాబాద్‌నించి. మధాహ్యం రెండు మీటింగ్స్ ఉన్నాయ్. అటెండైతే చాలు" సాగర్ చెప్పాడు.

"మరి నేనెప్పుడైనా లీవ్ పెట్టమంటే ఏడుస్తావ్?" కోపంగా అడిగి ఆమె గిరుక్కున గదిలోకి వెళ్ళిపోయింది.

సుచిత్ర నిశ్చేష్టురాలై చూస్తూండిపోయింది.

సాగర్ ఇబ్బందిగా చెప్పాడు.

"ఇంట్లోనే అని చెప్పాగా. స్నానం చేస్తావా సుచీ? రా నీకు రూం చూపిస్తాను."

"విజయవాడలోనే స్నానం చేసేసా. మధ్యాహ్నం మీటింగ్స్ అన్నావు. రా. కూర్చో మాట్లాడుకుందాం" సుచిత్ర సోఫాలో తన పక్కన తడుతూ చెప్పింది.

సాగర్ ఆమె పక్కనకాక ఎదురుగా కూర్చున్నాడు.

ఇద్దరికీ ఏం మాట్లాడాలో అర్ధంకాలేదు.

సాగర్ భార్య హేండ్ బేగ్‌తో వచ్చి చెప్పింది.

"నేను వెళ్తున్నాను. ఇంట్లో సిసి కెమెరాలు ఉన్నాయని మర్చిపోకు."

ఆమె సుచిత్ర వైపు చూడకుండా బయటకి వెళ్ళిపోయింది.

అవమానంతో సుచిత్ర మొహం కందిపోయింది.

సాగర్ నుదిటిమీద వేళ్ళతో రాసుకుంటూ చెప్పాడు.

"చదువుకి, సంస్కారానికి సంబంధంలేదు సుచీ. తను ఐఐయంలో చదివింది. మంచి జాబ్ చేస్తుంది. నిన్ను పలకరించలేదు. ఇంకా సిసి కెమెరాలున్నాయని వార్న్ చేస్తోంది. మెంటల్ పీస్ లేదనుకో."

సుచిత్రకి ఏం మాట్లాడాలో అర్ధంకాలేదు.

"సాగర్. జయంత్ వీకెండ్ ఉంటాడో లేదో కనుక్కుని రాత్రికి బెంగుళూర్ వెళ్ళిపోతా" చెప్పింది.

"వర్క్‌లో అంతా మెచ్చుకుంటారు సుచీ. ఏదో ఓ రోజు సి.ఇ.ఓ ఐపోతావ్' అంటారు. ఇంటికి వస్తే నరకం. తగని అనుమానం మనిషి. జై తో ఫోన్‌లో మాట్లాడతా కదా. ఓసారి అడిగింది 'మీరిద్దరూ గే సా?' అని.

"ఛ" సుచిత్ర అప్రయత్నంగా అన్నది.

"కాబ్‌వెబ్‌లో చిక్కిన ఈగలా తయారయ్యాననుకో. బయటకి వెళ్ళే మార్గంలేదు. అమ్మా నాన్నతో మాట్లాడినా భరించలేదు. వాళ్ళమ్మతో మాట్లాడినా కూడా. విడాకులు ఇవ్వదట. నేను లేకుండా బతకలేదుట. చూస్తూండు. అరగంటలో వచ్చేస్తుంది. మనల్ని వంటరిగా వదలదు"

"సారీ సాగర్. నీమీద దిగులుగా ఉంది. ఎక్కువగా ఆలోచించకు" బాధగా చెప్పింది.

"ఆలోచిస్తే పిచ్చివాడినయ్యేవాడ్ని. అందుకే వర్క్ మీద కాన్సంట్రేట్ చేస్తున్నా. పొద్దున వెళ్ళి రాత్రికి వస్తా. అందుకే ఈ ప్రమోషన్స్. కానీ ఇంట్లో శాంతిలేదు" సాగర్ విచారంగా చెప్పాడు.తలుపు తీసిన చప్పుడైంది.

లోపలికి వచ్చిన అతని భార్య భుజాలెగరేసి చెప్పింది.

"అదే పోజ్‌లో ఉన్నారా? నేను ఇవాళ ఇంట్లోంచే పనిచేస్తున్నా" బెడ్‌రూంలోకి వెళ్ళిపోయింది.

రెండు నిమిషాల తర్వాత ఫోన్‌లోంచి తలెత్తిన సుచిత్ర చెప్పింది.

"జైకి వేరే ప్లాన్ లేవుట. వచ్చెయ్యమన్నాడు. ఫ్లైట్స్ చూస్తున్నా"

మరో ఐదు నిమిషాల తర్వాత చెప్పింది.

"దొరికింది. ఫైవ్‌కి డిపార్చర్. నువ్వూ వస్తావా బెంగుళూర్? వీకెండేగా?"

సాగర్ విషాదంగా నవ్వి తల అడ్డంగా తిప్పాడు.

"పద సుచీ. మనం బయటకి వెళ్ళి లంచ్ చేసి ఏర్‌పోర్‌కి వెళ్ళే సరికి టైమైపోతుంది" లేస్తూ చెప్పాడు.

"సుచిత్రకూడా లేచి లోపలకి ఓసారి చూసింది.

"ఫార్మాలిటీస్ అక్కర్లేదు. ఇంటికి వచ్చిన వాళ్ళని పలకరించని వాళ్ళకి బై చెప్పక్కర్లేదు"

సాగర్ ఆమె సూట్‌కేస్ అందుకున్నాడు. తలుపు మూసి ఇద్దరూ లిఫ్ట్‌లో కిందకి దిగారు.

బయటకి వచ్చాక సుచిత్ర చెప్పింది.

"పులిబోనులో ఉన్నట్లుంది. అమ్మో! ఎలా భరిస్తున్నావ్ సాగర్?"

"అందుకేగా ఎక్కువసేపు వర్క్ చేసుకునేది. ఓసారి తను వద్దంటున్నా అమ్మా నాన్నల్ని చూడడానికి వెళ్ళానని స్లీపింగ్ పిల్స్ మింగేసింది."

"బాబోయ్."

"ఇదివరకు భయపడేవాడిని. ఇప్పుడా భయం పోయింది. మేమిద్దరం ఒకే ఇంట్లో ఉంటున్న శత్రువులం."

ఏర్‌పోర్ట్‌లోకి వెళ్ళేప్పుడు సుచిత్ర సాగర్‌ని పట్టుకుని పెద్దగా రోదించింది.

"ఐ యాం వెరీ సారీ. నేనేమని ప్రార్థించాలో కూడా తెలీడంలేదు. నీకు మనశ్శాంతిని ఇవ్వమనే దేవుడ్ని ప్రార్థిస్తా."

సాగర్ ఆమె కన్నీళ్ళు తుడుస్తూ చెప్పాడు.

"వద్దులే. వేరేవాళ్ళ చావుని ఆశించకూడదు."

బెంగుళూర్ ఏర్‌పోర్ట్‌లోంచి బయటకి రాగానే ఎదురువచ్చిన జయంత్ ఆమెని ఎత్తుకుని గాల్లో గిరగిర తిప్పాడు.

"నిన్ను చూస్తూంటే ఎంత హేపీగా ఉందో తెలుసా సుచీ?"

"అదేమరి. ఎన్నిసార్లు పిలిచాను. ఒక్కసారైనా మా ఇంటికి వచ్చావా?" నిష్టూరంగా అడిగింది.

"ఎక్కడ? టైముండటంలేదు. దేకి కనీసం నలభై గంటలైనా ఉండుంటే తప్పకుండా వచ్చేవాడిని" ఆమె సూట్‌కేస్‌ని అందుకుంటూ చెప్పాడు.

"అంత బిజీయాండీ తమరు?" అతని పక్కన నడుస్తూ అడిగింది.

"సూపర్ బిజీ."

జయంత్‌ది మూడు బెడ్‌రూమ్స్ ఫ్లాట్. విశాలంగా ఉంది. నీట్‌గా కూడా ఉంది.

"డిన్నర్ చేసి వద్దామా?" ఇంటికి వచ్చిన గంటకి అడిగాడు.

"నావల్ల కాదు. పొద్దున ఐదింటికి లేచా విజయవాడలో. ఈ సుడిగాలి పర్యటనతో అలిసిపోయా. ఏదైనా ఆర్డర్ చెయ్" అలసటగా చెప్పింది.

"సాగర్‌ని చూసాక పెళ్లంటే భయమొచ్చింది సుచీ. అమ్మా వాళ్ళు 'ఇంకా ఎంతకాలంరా వంటరిగా అంటారు. నాకేమో ఎలాంటి పెళ్ళాం వస్తుందో అని భయం. లవ్ చేద్దామంటే నాకు టైం లేదు" జయంత్ నవ్వాడు.

శని, ఆదివారాలు జయంత్ సుచిత్రని ఊరంతా తిప్పాడు. ఆదివారం సాయంత్రం ఏర్‌పోర్ట్‌లో డ్రాప్ చేస్తూ చెప్పాడు. "సింగిల్‌గా ఉంటే సౌకర్యమిదే. ఒకరికి నచ్చచెప్పకుండా, తర్వాత బతిమాలకుండా మన లైఫ్ మన ఇష్టం వచ్చినట్లు నడుపుకోవచ్చు.

"నిజం చెప్పు జై. నీకు వెలితిగా ఉండదా?" సుచిత్ర ప్రశ్నించింది.

"ఈ మధ్య కొంచెం. ఆఫీస్‌నించి ఇంటికి వచ్చాక ఇంట్లో ఎవరైనా వుంటే బాగుండు అనిపిస్తోంది. వీకెండ్స్‌లో ఫ్రెండ్స్‌మి కలుస్తాం ఓ ఆరుగురం. నేను తప్ప అంతా మేరీడే. రాత్రి తొమ్మిదవగానే ఒక్కొక్కరికీ కాల్స్, మెసేజ్‌లు మొదలవుతాయి. అవి చూసుకుని వాళ్ళు 'ఇక బయలుదేరతారా', 'పాపం తనకి బోర్ కొడుతోందిట పోదామా ', 'నెక్స్ట్ వీక్ కలుద్దామబ్బాయ్' ఇలాంటివి చెప్పి వెళ్ళిపోతారు.

ఒక్కణ్ణే మిగిలిపోతాను. నన్ను రమ్మని పిలిచేవాళ్ళు లేరే అనిపిస్తుంది. సాగర్ గుర్తురాగానే భయమేస్తుంది" జయంత్ నిజాయితీగా ఒప్పుకున్నాడు.

"సాగర్‌నే ఎందుకు గుర్తుకు తెచ్చుకుంటావ్? పోనీ కావేరిని తలచుకో."

"కావేరిలాంటి అమ్మాయి వాడికి దొరికి వుంటే, కెరీర్‌లో ఈపాటకి ఎక్కడుండేవాడో. వాడికి వి.పి పెద్ద పోస్ట్ కాదు. ఇంట్లో ప్రశంతంగా ఉంటే, ఇంకా చాలా సాధించేవాడు. నాలా వంటరిగా ఉన్నాకూడా."

"నువ్వు పిరికివాడివి జై. ప్రయత్నించు. మంచి అమ్మాయే దొరుకుతుంది" సుచిత్ర సలహా ఇచ్చింది.

"అవునవును. శ్రీకాంత్ కూడా పాపం అదే అనుకున్నాట్ట" నవ్వాడు.

"చంపుతాను" సుచిత్ర అరిచింది.

కారు ఏర్‌పోర్ట్ పార్కింగ్‌లో ఆగింది.

***

పూనే ఏర్‌పోర్ట్‌లో సుచిత్రని రిసీవ్ చేసుకున్న రచన రుసరుసలాడుతూ అడిగింది.

"ఏం తల్లీ. వీకెండ్‌ని ఆ జైగాడితో ఎంజాయ్ చేసి మండే నించి నా నెత్తిమీదకెక్కుతావా?"

"సారీ.. సారీ రచనా సాగర్ తర్వాత నిన్నే కలుద్దాం అనుకున్నా. కానీ అక్కడి పరిస్థితి చూసాక, వెంటనే ఫైర్‌బ్రాండ్‌లాంటి నీదగ్గరకి రావాలనిపించలేదు. జై అయితే మూడ్ మార్చేస్తాడని అటువెళ్ళా. పర్లేదులే రేపు నువ్వు ఆఫీస్‌కి వెళ్ళు. నేను నువ్వు వచ్చేలోగా నీ ఇల్లు సర్దిపెడతాలే" సుచిత్ర క్షమాపణగా చెప్పింది.

"ఏమక్కర్లేదు. ఇల్లు బానేవుంది. పద. మండే, ట్యూజ్‌డే సెలవు పెడతాలే."

"అయ్యో రెండురోజులు ఎందుకు రచనా. రేపొక్కరోజు ఉండి, రేపు సాయంత్రం హైద్రాబాద్ వెళ్ళిపోదాం అనుకున్నా" సుచిత్ర నొచ్చుకుంటూ చెప్పింది.

"అంతా నీ ఇష్టమేనా? రాకరాక ఇంతదూరం వచ్చావు. రెండు రోజులుకూడా ఉండవా?" రచన అరిచింది.

"ష్! అరవకు ఉంటాలే" సుచిత్ర చూ చూస్తూ చెప్పింది.

రచన ఇల్లుకూడా ముచ్చటైన మూడు బెడ్‌రూమ్స్ ఫ్లాట్. పాపని ఆడిస్తున్న సదారాం ఆప్యాయంగా పలకరించాడు.

"ఎలా ఉన్నారు సుచిత్రా?"

"బాగున్నాను. మీరు?" అడిగింది.

"గ్రేట్. రండి మంచినీళ్ళు కావాలా?" ఆదరంగా అడిగాడు.

"వద్దు. లేవకండి."

చేతులు కడుక్కొచ్చి పాపని ఎత్తుకుంది.

"సదా ఫ్రిజ్‌లో ఎగ్స్ లేవు. పాలు కూడా తక్కువే ఉన్నాయి. అన్నీ నింపమన్నానుగా?" రచన కిచెన్‌లోంచి అరుస్తోంది.

"పాపతో షాపింగ్‌కి ఎలా వెళ్తాను? ఇప్పుడు తెచ్చేస్తాలే" సదారాం లేచాడు.

"నేనుండే రెండురోజులేనా ఈ హడావిడి? రచనా నేను నీకు హెల్ప్ చేస్తా. ఏముంటే అవే వండుదాం. సరేనా?" సుచిత్ర వంటగదిలోకి వెళ్ళింది. రచన ఫ్రిజ్ తెరిచి ఏదో ఆలోచిస్తోంది. కిచెన్ శుభ్రంగా అద్దంలా ఉంది.

"రచనా. లే. నేను చేస్తాను ఈ రోజు వంట" చెప్పింది.

"క్రిస్పర్‌లో ఉన్న వెజిటబుల్స్‌తో ఏం చేయగలవో అవి చేయవే" క్రిస్పర్‌ని ఐలెండ్ మీద పెట్టింది రచన.

రాత్రి భోజనాలయ్యాక సదారాం పాపతో బెడ్‌రూంలోకి వెళ్ళిపోయాడు. స్నేహితురాళ్ళిద్దరూ బాల్కనీలో కూర్చున్నారు.

"నీ లైఫ్ బాగుంది రచనా. సదాగారు మంచబ్బాయ్. ముద్దొచ్చే బేబీ. ఇద్దరికీ మంచి జాబ్స్. మరి నేను ఫోన్‌లో ఎలాగున్నావు అంటే 'ఏదో ఇలాగున్నాను' అన్నావెందుకూ?" సుచిత్ర అడిగింది.

రచన గలగల నవ్వింది.

"అప్పుడు మూడ్ ఎలా ఉందో? ఆ గుర్తొచ్చింది. మెయిడ్ రాలేదు. నాకు ఇంటిపని బద్ధకం. తెలుసుగా? ఎక్కువగా సదానే చేస్తూంటాడు. నిన్ను చూసి మొహమాటపడి ఇవాళ కిచెన్‌లోకి రాలేదు. రేపు ఇంట్లోనే ఉంటాలే. మంగళవారం తప్పదు. ఆఫీస్‌కి వెళ్ళాలి. సదా నిన్ను ఏర్‌పోర్ట్‌లో డ్రాఫ్ చేస్తాడులే" చెప్పింది.

"నువ్వు ఉండనప్పుడు నన్ను రేపే పంపేయచ్చుగా తల్లీ. పగలంతా ఇంట్లో ఒక్కదాన్నే ఉండి సాయంత్రం సదాగారితో ఏర్‌పోర్ట్‌కి వెళ్ళడం అవసరమా?" సుచిత్ర అడిగింది.

రచన ఓ క్షణం ఆలోచించి చెప్పింది.

"సరే. అలాగే పో"

ఉదయం ఆరుగంటలకే రచన అరుపులతో సుచిత్రకి మెలుకువ వచ్చింది. లేచి బయటకి వచ్చి అడిగింది.

"ఏంటే బ్రహ్మ రాక్షసీ తెల్లారిందా అరుపులకి?"

"అంటావు. ఎందుకనవు? అదిగో ఆయనగారు నవ్వుతున్నారు కూడానూ. ఇవాళ లీవ్ పెట్టానా? మా మేనేజర్ రాక్షసి మెసేజ్ పంపింది. నేను వెళ్ళకపోతే మా కంపెనీ దివాలా తీస్తుందిట. ఈ గోలలో నేనుంటే పనిపిల్ల ఇంకా రాలేదు. రోజూ ఆరింటికల్లా రమ్మంటాను. రాదు. మరి అరవకపోతే ఎలా?" మేకప్ చేసుకుంటున్న రచన కోపంగా అడిగింది.

"అరిస్తే వస్తుందా? దారిలో వుందేమోలే. ఐనా ఇవాళ నేనుంటాగా. పర్లేదులే. మా నాన్న చెప్పినట్లు తల అమ్ముకున్నాక వాళ్ళు రమ్మంటే వెళ్ళాలిగా"

"వెళ్తున్నాగా? నీకు మరాఠీ వచ్చా? దానికి ఒక్క హిందీ ముక్కరాదు. ఇంక ఇంగ్లీష్ విషయం మర్చిపో."

"సదా నాకు లేటైంది. బేబీని నువ్వే డే కేర్‌లో వదిలి వెళ్ళు."

రచన హడావిడిగా బేగ్ సర్దుకుంది షూ వేసుకోబోతూ సుచిత్రని గాఢంగా కౌగలించుకుని చెప్పింది.

"సుచీ అందరం ఒకసారి కలుద్దామే."

"అలాగే ప్లాన్ చేద్దాం" సుచిత్ర ఒప్పుకుంది.

"రచన చిన్నప్పటినించి ఇంతేనాండి? ఫైర్ బ్రాండేనా?" సదారాం పాపకి డైపర్ మారుస్తూ అడిగాడు.

"ఇంతే. ఇప్పుడు అసహనం ఇంకాస్త పెరిగింది. వాళ్ళ బాబాయ్ ఏమనేవాడో తెలుసా?" సుచిత్ర నవ్వింది.

"చెప్పొద్దు. చెప్పావంటే చంపేస్తా. ఐనా నువ్వు నాకు ఫ్రెండ్వా? సదా ఫ్రెండ్వా?" అరిచింది.

"పర్లేదులే అంత తెలుగు అర్థమవ్వాలిగా" సుచిత్ర చిలిపిగా చెప్పింది.

"ప్లీజ్ చెప్పండి. ఏమనేవాడు?" సదారాం ఉత్సుకతగా అడిగాడు.

"హింస రచన, ధ్వంస రచన అనేవాడు. ఇది కోపంతో వాళ్ళ తమ్ముడిని కొడ్తూ, ఇంట్లోవి పగలకొడూ ఉండేది."

"అప్పట్లో మా బాబాయ్ శ్రీశ్రీ అభిమాని కమ్యూనిస్ట్" రచన కూడా నవ్వేసింది.

రచన ఆఫీస్‌కి వెళ్ళిపోయిన ఐదు నిమిషాలకి పనిపిల్ల వచ్చింది.

"ఈ అమ్మాయి ఆ మలుపులో దాక్కుని రచన కారు వెళ్ళగానే లోపలికి వచ్చిందనుకుంటా" సుచిత్ర చెప్పింది.

సదారాం పెద్దగా నవ్వాడు.

"పసిపాప మనస్థత్వం అండీ రచనది. ఏదో అరుస్తూంటుంది కాని మంచి మనసు. ఐ లవ్ హర్" మురిపెంగా చెప్పాడు.

సుచిత్ర ముచ్చటగా చూసింది

ఏడున్నరకల్లా సదారాం పాపతో వెళ్ళిపోయాడు. పనిపిల్ల పనులన్నీ చేసి వెళ్తున్నానన్నట్లుగా సైగ చేసి వెళ్ళిపోయింది.

సుచిత్ర కాఫీ కలుపుకుని బాల్కనీలో కూర్చుంది. మరాఠీ పద్దతి కట్టుబొట్టులో ఉన్న ఆడవాళ్ళు పెద్ద పెద్ద కూరగాయగంపలతో నడుస్తున్నారు.

ఈ రోజుతో తన సర్వే పూర్తయింది. ఏం సాధించిందనే ఆలోచన కలిగిందామెకి. ఏదో ఉద్వేగంతో ఉన్న పళాన బయలుదేరి వచ్చింది. కానీ తను ఏదీ మార్చలేదు. బయటనించీ చూసే తనకి కొన్ని లోతైన విషయాలు తెలీవు అనుకుంది.

సాయంత్రం ఐదుగంటలకి రచన నించి ఫోన్ వచ్చింది.

"సారీనే రాలేకపోతున్నా. సదా నిన్ను ఏర్‌పోర్ట్‌లో డ్రాప్ చేస్తాడు. ఏమనుకోకు బంగారం. ఎప్పుడైనా విసుగుపుడితే నీ దగ్గరకి వచ్చేస్తాలే ఈ మొగుడ్ని, పిల్లని వదిలేసి" చెప్పింది.

"పర్లేదు. పని ముఖ్యం. సదాగారు కూడా అక్కర్లేదు. నేను వెళ్ళిపోతాను. నీకు రెండు మూడు రోజులకి సరిపడా వంటచేసి ఫ్రిజ్‌లో పెట్టాను. అన్నంతోనో, చపాతీలతోనో తిను. కోపం తగ్గించుకో" సుచిత్ర హిత బోధ చేసింది.

"వావ్! సుచీ నువ్వు సూపరే. ఇంటికొచ్చాక వంట పనిలేదంటే ఎంత ఆనందమో!" ఆ ఆనందం తన గొంతులో ధ్వనించింది.

"ఇంకా ఏమైనా కావాలా చెప్పు. ఇంట్లో ఉన్నవాటినిబట్టి చేస్తాను" సుచిత్ర ప్రేమగా అడిగింది.

"ఇంక చాలు సర్దుకుని ఏర్‌పోర్ట్‌కి వెళ్ళడానికి రెడీగా ఉండు" రచన ఫోన్ పెట్టేసింది.

ఐదున్నరకల్లా సదారాం పాపతో వచ్చాడు.

"పది నిమిషాల్లో బయలుదేరదామండీ" చెప్పాడు.

"సారీ. ఇప్పటిదాకా పనిచేసొచ్చి మళ్ళీ డ్రైవ్ చెయ్యాలి" సుచిత్ర ఇబ్బందిగా చెప్పింది.

"ఏం పర్లేదు. రచన ఫ్రెండ్‌కి ఇంత మొహమాటం బాలేదు" నవ్వాడు.

సుచిత్ర ఏర్‌పోర్ట్ నించి ఇంటికి చేరుకునేసరికి పదిన్నరైంది. శ్రీకాంత్ బుద్ధిగా టి.వి చూస్తున్నాడు. ఆమెని చూడగానే ఎదురొచ్చి అడిగాడు.

"హాయ్ సుచీ. ఏర్‌పోర్ట్‌కి వస్తానంటే ఎందుకు వద్దన్నావు?"

"మన ఊరేగా కాంతూ. నేను వచ్చేయగలను కదా? నువ్వంత దూరం పడీపడీ రావాలా?" అతన్ని అల్లుకుపోతూ చెప్పింది.

డైనింగ్ టేబుల్ మీది బౌల్స్ ని, బెడ్‌రూంలో వెలిగించి వున్న సెంటెడ్ కేండిల్‌ని, స్నానం చేసి మొహానికి పౌడర్ రాసుకుని ఉన్న శ్రీకాంత్‌ని చూడగానే ఆమెకి చాలా ప్రశాంతంగా అనిపించింది.

"నేను లేనన్ని రోజులు హాయిగా ఉన్నావా కాంతూ?" చిరునవ్వుతో అడిగింది.

"ఎలా ఉన్నాననంటావ్?" శ్రీకాంత్ ఎదురు ప్రశ్న వేసాడు.

"నాకు తెలుసులే" నవ్వింది.

"ఇంతకీ నీ ట్రిప్ ఎలా గడిచింది?" భోజనాలయ్యాక అడిగాడు.

"కావేరి ఆశతో బతుకుతోంది. మధుర్ మంచివాడు. అతని పేరెంట్సే కొంచెం సాధించేవాళ్ళయినా ఇంకా పిల్లలు పుట్టలేదని వాళ్ళు ఆగ్రహంగా ఉన్నారని, ఒకరిద్దరు పిల్లలు పుడితే వాళ్ళూ మధుర్‌లాగే ప్రేమగా ఉంటారని ఆశ. ఆర్థిక ఇబ్బందులు లేవు. కెరీర్ గోల లేదు. నిశ్చింతగా ఉంది. ఉత్తమ ఇల్లాలు. అందుకే 'చాలా బాగున్నాను' అని చెప్పింది."

"సాగర్?"

ఆమె మొహంలో విషాదం ప్రవేశించింది.

"సాగర్ నిరాశలో బతుకుతున్నాడు. భార్యకి అనుమానం. టూమచ్ పొసెసివ్ అండ్ జెలస్ లేడీ. నన్ను పలకరించలేదు. మేమిద్దరం పగలంతా ఇంట్లో ఉంటామని, లీవ్ పెట్టి వెనక్కి వచ్చేసింది. వాళ్ళ పేరెంట్స్‌తో మాట్లాడినా

ఊరుకోదట. డివోర్స్‌కూడా ఇవ్వనందిట. ఆ డిప్రషన్‌లో రోజుకి పన్నెండునించి పధ్నాలుగు గంటలు ఆఫీస్ వర్క్ చేస్తున్నా అన్నాడు. ఇది పరిష్కారం లేని సమస్య. సినిమాల్లోలా ఆ అమ్మాయి సడన్‌గా మారాలి. అది కుదిరేపనికాదు."

"ఇక్కడ కూడా పిల్లలే పరిష్కారమేమో! పిల్లలు పుడితే ఆమె ధ్యాస వాళ్ళమీదకి మళ్ళుతుందేమో?" శ్రీకాంత్ చెప్పాడు.

"ఏమో మరి డౌటే. ఇక జయంత్ పిరికివాడు. సాగర్ జీవితాన్ని చూసి, పెళ్ళి చేసుకుంటే, అలాంటి అమ్మాయి వస్తుందేమో మెంటల్ పీస్ ఉండదేమో అని భయం. వర్క్ చేసుకుంటూ ఫ్రెండ్స్ తో హేంగవుట్ అవుతూ 'నాకేం బ్రహ్మాండంగా ఉన్నా' అనుకుంటాడు .కాని వంటరితనం అతన్ని బాధిస్తూనే ఉంది. మంచమ్మాయిని పెళ్ళి చేసుకుంటే నిజంగా బ్రహ్మాండంగా ఉంటాడు."

"ఇంక రచన."

సుచిత్ర మొహంలో చిరునవ్వు ప్రవేశించింది.

"అదరికన్నా హేపీగా బతుకుతోంది. అరుపులు, కేకలు, గందరగోళం. అది ఉన్న చోట హడావిడి. మళ్ళీ ఏ పనిలో నిర్లక్ష్యం, అశ్రద్ధ లేదు. సదారాం కూల్‌గా ఉంటాడు. బేబీ ముద్దుగా ఉంది. అసహనంతో అరుపులే కాని గుడ్ ఎట్ హార్ట్. నువ్వన్నట్లు దాని మూడ్‌ని బట్టి సమాధానం ఇస్తుంది. మధుర్‌ని ఎలా ఉన్నారు? అంటే 'ఆనందంగా ' అన్నాడు. సదారాంని అడిగితే గ్రేట్' అన్నాడు. అది చాలదూ నా స్నేహితురాళ్ళిద్దరూ చాలా బాగున్నారని."

"ఇక సుచిత్ర"

"నాకేం అద్భుతంగా ఉన్నాను. నిన్న ఉన్నట్లు ఇవాళ ఉండదు. శ్రీకాంత్‌తో అన్నీ ఆశ్చర్యాలే. అన్నీ సంభ్రమాలే."

అతని బుగ్గలు పిండుతూ మురిపెంగా చెప్పింది.

"థాంక్స్. ఐనా ఇదా నీ సర్వే. దీన్ని మా నాయనమ్మ 'కొండని తవ్వి ఎలుకని పట్టిందిట' అనేది బతికుంటే."

"డూస్, డోంట్స్ నేర్చుకున్నా కాంతూ. చూడూ. వాటిని ఇంప్లిమెంట్ చేసాక నీకే అర్ధమవుతుంది. ముఖ్యంగా నీకు దూరంగా రెండురోజులకంటే ఎక్కువకాలం ఉండలేనని తెలుసుకున్నా" సుచిత్ర అతన్ని హత్తుకుని చెప్పింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments